సాక్షి నల్లగొండ

శుక్రవారం । 26 । జూలై । 2024



కళాకారుల పాత్ర కీలకం

సమాజ చైతన్యంలో కళాకారుల పాత్ర కీలకమని ఎమ్మెల్యేలు సామేల్, వీరేశం, జీఎల్ఆర్ అన్నారు. -IIలో



చేనేత కళను పరిరక్షించుకోవాలి

చేనేత కళను పరిరక్షించుకోవాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్ అన్నారు. -IIలో



సరస్వతీ పుత్రుడిని ఆదుకుంటాం

సరస్వతీ పుత్రుడిని ఆదుకుంటామని మాజీమంత్రి కేటీఆర్ తెలిపారు. 'సాక్షి' కథనానికి ఆయన స్పందించారు. -IIలో

న్యూస్‌రీల్

నేడు నల్లగొండకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం నల్లగొండకు రానున్నారు. ఉదయం 8 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి 10 గంటలకు నల్లగొండకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు నల్లగొండ మండలం దోనకల్ గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేసి నల్లగొండలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ నూతన భవన నిర్మాణం పనులు పరిశీలించనున్నారు. 3 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొననున్నారు.

నిధులు కేటాయించాలి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్: శ్రీశైలం సొరంగ మార్గానికి నిధులు కేటాయించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించాలని, మూసీ ఎడమ కాలువ మరమ్మతులు, ఆధునీకరించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నారి అయిలయ్య, పాలడుగు నాగార్జున ఉన్నారు.

మూసీ కాల్వలకు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న వేముల వీరేశం, బీఎల్ఆర్, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

కేతేపల్లి, సూర్యాపేట రూరల్: వానాకాలం పంటల సాగుకు మూసీ ప్రాజెక్టు నీటిని కుడి, ఎడమ కాల్వలకు గురువారం సాయంత్రం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మిర్యాలగూడెం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిలతో కలిసి విడుదల చేశారు. రిజర్వాయర్‌లో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరువలో ఉండటంతో వానాకాలం సాగుకు నీటిని విడుదల చేస్తున్నట్లు వారు తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకుని చివరి ఆయకట్టు భూములకు చేరే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మూసీ ప్రాజెక్టు డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈలు మమత, స్వప్న, ఉదయ్, నకిరేకల్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మందడి వెంకట్రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, రైతు ప్రతినిధులు కంపసాటి శ్రీనివాస్‌యాదవ్, జటంగి వెంకటనర్సయ్యయాదవ్, మహేందర్‌రెడ్డి, గుత్త మాధవరెడ్డి, కోట వెంకటేశ్వర్‌రావు, బడుగుల నరేందర్, కందుల మణి, కత్తుల వీరయ్య, ఇందిర, మట్టి సాల్మన్, ఎడ్ల ప్రవీణ్, గోవర్ధన్‌రెడ్డి, వినయ్‌సాగర్ పాల్గొన్నారు.



కార్గిల్ విజయానికి పాతికేళ్లు

మంచుకొండల్లో నిప్పు కణికలై నిలిచే ధైర్యం. నెత్తుటి మడుగులో నీఅడుగే నిదర్శనం. వెలకట్టలేని సాహసం.. వెన్ను చూపని వీరత్వం.. మరణం మీ ముందున్నా.. మీసం మెలేసే పౌరుషం. దొంగ దెబ్బకు తలొంచని ధీరత్వం.. మంచుకొండల్లో మడమతిప్పని పరాక్రమం.. భారత సైనికుల శౌర్యానికి సజీవ సాక్ష్యం.. కార్గిల్ యుద్ధం. కార్గిల్ విజయానికి నేటితో 25 ఏళ్లు పూర్తవుతున్నాయి.

- వివరాలు IIలో ▸

సాగునీటికి ప్రాధాన్యం

గతంలో కంటే సాగునీటి ప్రాజెక్టులకు పెరిగిన కేటాయింపులు



- అయినా.. పనుల పూర్తికి సరిపోని నిధులు
- ఎస్ఎల్‌బీసీకి అవసరమైన నిధులు రూ.5 వేల కోట్లు
- బడ్జెట్‌లో కేటాయింపు మాత్రం రూ.800 కోట్లు
- ఎత్తిపోతలకు రూ.500 కోట్లు, డిండికి రూ.300 కోట్లు
- టన్నెల్‌కు గ్రీన్ చానెల్ ద్వారా నిధుల ఊసేలేదు
- డిండికి నీటి కేటాయింపులపై ఇప్పటికీ స్పష్టత కరువు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో జిల్లా ప్రజల్లో ఆశలు రేకెత్తాయి. ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ఈసారి కేటాయింపులు భారీగా పెరిగాయి. అయినా జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టు పనులకు అవి సరిపోని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టుల్లో 6 ప్రాజెక్టులను ఈ ఏడాది, మరో 12 ప్రాజెక్టులను వచ్చే ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేస్తామని గురువారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. అయితే, జిల్లాలో కీలకమైన ఎస్ఎల్‌బీసీ సొరంగానికి భారీగా నిధులు అవసరం ఉన్నా.. అందులో పావలా వంతు కూడా కేటాయించలేదు.



రూ.1699.50 కోట్లు కేటాయింపు

నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు మొత్తంగా రూ.8596 కోట్లు అవసరం కాగా.. ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో మొత్తం రూ.1699.90 కోట్లు కేటాయించింది. సూర్యాపేట జిల్లాలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజ్-2 కింద కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్అండ్ఆర్ పనులకు రూ.34 కోట్లు, మూసీ ప్రాజెక్టు, దాని అనుబంధ పనులు, ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఇతర పనులకు రూ.64.01 కోట్లు కేటాయించింది. ఎత్తిపోతలు, ఎస్సారెస్పీ కాలువల లైనింగ్ ఇతర పనులకు దాదాపు రూ.1200 కోట్లకు పైగా నిధులు అవసరమైనా కొద్దిమొత్తమే కేటాయించింది.

ఎత్తిపోతలకు రూ.500 కోట్లు

జిల్లాలోని ప్రాజెక్టులకు కేటాయించిన మొత్తం బడ్జెట్‌లో నాగార్జునసాగర్ పరిధిలోని ఎత్తిపోతల పథకాలకు రూ.500 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో వీటికి ప్రత్యేకంగా నిధులను కేటాయించకపోగా, ఈసారి ప్రత్యేకంగా వాటిని కేటాయించింది. అది కాకుండా నాగార్జునసాగర్ డ్యామ్ చిన్న పనులకు సంబంధించి గత బడ్జెట్‌లో రూ.95 లక్షలు మాత్రమే కేటాయించగా, ఈసారి రూ.3.89 కోట్లు కేటాయించింది. ఇక సాగర్ ఎడమ కాల్వ, డిస్ట్రిబ్యూటరీల పనులకు గతేడాది రూ. 37.12 కోట్లు ఇవ్వగా, ఈసారి రూ. 96.07 కోట్లు కేటాయించింది. అయితే, పాలమూరు రంగారెడ్డిలో అంతర్భాగంగా ఉన్న డిండి ఎత్తిపోతల పథకానికి నీళ్ల కేటాయింపును ప్రకటించలేదు. పలు ఎత్తిపోతల పథకాలకు దాదాపు రూ.3,346 కోట్లు అవసరం ఉంటే.. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించింది. బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు కాలువల పనులకు ఇంకా రూ.250 కోట్లు అవసరం ఉన్నా బడ్జెట్‌లో ప్రత్యేకంగా ఎక్కడా చూపించలేదు.

రూ.5వేల కోట్లు అవసరం ఉన్నా..

ఎస్ఎల్‌బీసీ టన్నెల్, అనుబంధ పనులు, కాలువలు, ఆర్అండ్ఆర్ పనులకు మొత్తంగా రూ.5 వేల కోట్లు అవసరం కాగా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.800 కోట్లు కేటాయించింది. కేవలం టన్నెల్ పనులకే ప్రత్యేకంగా రూ.2 వేల కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం బడ్జెట్‌లో 323.09 కోట్లు కేటాయించింది. అనుబంధ పనులైన కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్ అండ్ పనులకు మరో రూ.3 వేల కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం రూ.476.81 కోట్లు కేటాయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా మంత్రులు కూడా ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. గ్రీన్ చానెల్ కింద ముఖ్యమంత్రి నిధులు కేటాయిస్తామన్నందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రైతు భరోసా సభలో ముఖ్యమంత్రికి ప్రజల ముందే ధన్యవాదాలు తెలిపారు. ప్రజలంతా సొరంగమార్గానికి భారీగా నిధులు కేటాయిస్తారని ఆశించారు. అయితే, ఆ మేరకు నిధులను కేటాయించలేదు.

డిండి ప్రాజెక్టుకు..

డిండి ప్రాజెక్టుకు సంబంధించి డ్యామ్, ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్అండ్ఆర్ పనులకు గతేడాది మొత్తంగా రూ.608.63 కోట్లు ఇవ్వగా, ఈసారి రూ. 300 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఇందులో డ్యాం, దాని అనుబంధ పనులకు గతేడాది రూ.586.03 కోట్లు ఇస్తే, ఈసారి రూ.171.10 కోట్లు ఈ బడ్జెట్‌లో కేటాయించారు. కాలువలు, డిస్ట్రిబ్యూటరీలకు గతేడాది రూ.21.31 కోట్లు మాత్రమే ఇవ్వగా, ఇప్పుడు రూ. 98.90 కోట్లు కేటాయించింది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద గత బడ్జెట్‌లో రూ.1.28 కోట్లు మాత్రమే ఇవ్వగా ఈ బడ్జెట్‌లో రూ.30 కోట్లు కేటాయించింది.

ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యం

జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్, ఇతరత్రా అన్ని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ఇస్తామని, ప్రాధాన్యతా క్రమంలో అన్నింటినీ పూర్తి చేస్తామని తెలిపారు.

– నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వెనుకబడిన ప్రాంతాలను విస్మరించారు



రాష్ట్ర బడ్జెట్ వెనుకబడిన ప్రాంతాలను విస్మరించినట్లుగా ఉంది. రైతు భరోసా, రైతు బీమా ఏ రకంగా అమలు చేస్తారో బడ్జెట్‌లో పేర్కొనలేదు. పెండింగ్‌లో ఉన్న శ్రీశైలం సొరంగ మార్గం పూర్తికి, మూసీ ప్రాజెక్టు ఆధునీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించలేదు. వ్యవసాయ కార్మికులను, కౌలు రైతులను ఏ రకంగా ఆదుకుంటారో చెప్పలేదు. ఎంజీయూ, మెడికల్ కాలేజీలకు సరైన నిధులు కేటాయించలేదు.

– ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

ప్రాజెక్టులకు నిధులు ఎక్కువగా కేటాయించలేదు



బడ్జెట్‌లో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక నిధుల కేటాయింపు లేదు. శ్రీశైలం సొరంగ మార్గం, నక్కలగండి, డిండి ఎత్తిపోతల పథకం, చర్లగూడెం రిజర్వాయర్‌పై వివక్ష చూపారు. విద్య, వైద్యం కోసం కూడా సరైన నిధులు కేటాయించలేదు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ నిధులు ప్రజా సంక్షేమం కోసం ఎక్కువగా ఖర్చు చేయాలి.

– నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఆరు గ్యారంటీలతో మేలు

- వివిధ వర్గాల ప్రజలకు చేకూరనున్న లబ్ధి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలను ప్రకటించింది. వాటికే ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చింది. అందులో భాగంగా ఈ బడ్జెట్‌లో వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామని ప్రకటించింది. దాంతో జిల్లాలోని లక్షన్నర మంది వ్యవసాయ కూలీలుకు మేలు జరుగనుంది. ఆరు గ్యారంటీలకు బడ్జెట్ కేటాయించడంతో ఆయా పథకాల కింద జిల్లా ప్రజలకు మేలు చేకూరనుంది.

- ప్రభుత్వం మహిళా శక్తి సంఘాలకు చేయూతనిచ్చే కార్యక్రమాలను చేపట్టింది. మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో 2, దేవరకొండ, నకిరేకల్, మిర్యాలగూడలో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేయనుంది.
- గృహ జ్యోతి పథకం ద్వారా జిల్లాలో 2,07,540 మందికి లబ్ధి చేకూరనుంది. అదే విధంగా రూ.500కే సబ్సిడీ గ్యాస్ పొందే వినియోగదారులు 6,08,701 మంది ఉన్నారు. వీరికి కూడా ప్రయోజనం కలుగనుంది.
- రైతులకు ధాన్యం కొనుగోలుకు సందర్భంలో క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని బడ్జెట్‌లో ప్రకటించింది. తద్వారా జిల్లాలోని 5.42 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూనుంది.
- ప్రభుత్వం అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని బడ్జెట్‌లో ప్రకటించింది. ఎప్పటిలోగా పూర్తి చేస్తామనే దానిపై నిర్దిష్ట ప్రకటన చేయకపోయినా దీనికింద ప్రజలకు లబ్ధి చేకూరనుంది.

నిధులు కేటాయించినా స్పష్టత కరువు

వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. అందులో రుణమాఫీ, రైతు భరోసా వంటి వాటికే భారీ ఎత్తున నిధులు పోతున్నాయి. యాంత్రీకరణ పరికరాల స్కీం చేపట్టలేని పరిస్థితి నెలకొంది.

పెండింగ్ బిల్లులపై లేని స్పష్టత..

జిల్లాలోని వివిధ శాఖల్లో పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. ముఖ్యంగా గ్రామ పంచాయతీల్లో గతంలో సర్పంచ్‌లు ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయన్న ఆశతో పనులు చేయించారు. చాలా గ్రామ పంచాయతీల్లో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెండింగ్ బిల్లులు ఉన్నాయి. వీటిపై కూడా బడ్జెట్‌లో ప్రస్తావన రాలేదు.

పాత పథకాల ప్రస్తావన లేదు?

గత ప్రభుత్వం యాదవులకు గొర్రెల పథకం, దళిత బంధు, బీసీ బంధు, తదితర వంటి పథకాలకు బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. ఈ పథకాలు ప్రభుత్వం పక్కన పెట్టినట్లుగా అర్థమవుతోంది.

సంక్షేమ శాఖల్లో అదే పరిస్థితి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు నిధుల కేటాయింపు జరిగింది. కానీ, అందులో ఏమైనా కొత్తగా చేపడుతున్నట్లుగా ఎక్కడా స్పష్టత ఇవ్వలేదు. ఇందులో సంక్షేమ హాస్టళ్లకు యథావిధిగా నిధులు ఖర్చవుతాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా ఆయా వర్గాల వారికి ఎలాంటి ఆర్థిక ప్రోత్సాహం అందించే పథకాలు చేపడతారనేది కూడా స్పష్టత లేదు.

పాఠశాల పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



ఎల్లారెడ్డిగూడెం హైస్కూల్‌లో పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నార్కట్‌పల్లి: మండలంలోని ఎల్లారెడ్డిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పనులు వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా చెరువుగట్టులోని శ్రీపార్వతి జడల రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. మౌలిక సదుపాయాల కల్పనకు శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట టీఆర్‌డీఓ మండల ప్రత్యేక అధికారి నాగిరెడ్డి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మహేంద్రకుమార్, పంచాయతీ రాజ్ ఈఈ భూమన్న, డిప్యూటీ ఇంజనీర్ మహేష్, ఎంపీడీఓ ఉమేష్, హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.



విశ్వ క్రీడలకు వేళైంది. క్రీడాభిమానులకు అతిపెద్ద పండుగొచ్చింది. ఫ్రాన్స్ దేశ రాజధాని ప్యారిస్‌లో శుక్రవారం నుంచి ఒలింపిక్స్-2024 ప్రారంభమవుతున్నాయి. ఈ ఒలింపిక్స్‌లో 16 క్రీడాంశాల్లో భారత్ నుంచి 117 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ ఒలింపిక్స్‌ను చూసేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన క్రీడాభిమానులు, క్రీడాకారులు, యువతీయువకులు ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ఈ సారి ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అత్యధిక పతకాలు సాధించి సత్తా చాటాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

– నల్లగొండ టూటౌన్, రామగిరి(నల్లగొండ)



జయహో భారత్

- నేటి నుంచి ఒలింపిక్స్ క్రీడా సంరంభం
- మన దేశ క్రీడాకారులు అత్యధిక పతకాలు సాధించాలని జిల్లావాసుల ఆకాంక్ష

ఒలింపిక్స్‌లో సత్తాచాటాలి



క్రీడలను భారత ప్రధానమంత్రి ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. ఇది క్రీడాకారులకు శుభపరిణామం. భారత క్రీడాకారులు చాలాసార్లు ఇతర దేశాల్లో గెలిచి సత్తాచాటారు. ఇదే స్ఫూర్తితో ప్యారిస్ ఒలింపిక్స్‌లోనూ అత్యధిక బంగారు పతకాలు భారత క్రీడాకారులే కైవసం చేసుకుంటారు.

– యానాల ప్రభాకర్‌రెడ్డి, ఒలింపిక్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు

భారత్ క్రీడాకారులవే అత్యధిక పతకాలు



ఒలింపిక్స్ క్రీడా పోటీలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానులు, ప్రజలు ఎంతో ఆసక్తిగా చూస్తారు. ఒలింపిక్స్ క్రీడాంశాల్లో భారత క్రీడాకారులు అత్యధిక పతకాలు సాధిస్తారనే నమ్మకం ఉంది. భారత్ క్రీడాకారులు ప్యారిస్ గడ్డపై తన సత్తా చాటుతారు.

– బొమ్మపాల గిరిబాబు, ఒలింపిక్స్ అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కోశాధికారి

ఈసారి ఎక్కువ పతకాలు వస్తాయి



గత ఒలింపిక్స్‌లో హాకీ విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నాం. ఈసారి పోటీల్లో భారత జట్టు బంగారు పతకం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ఈసారి షూటింగ్ క్రీడా విభాగంలోనూ ఎక్కువ పతకాలు వచ్చే అవకాశం ఉంది.

– ఇమామ్ కరీం, హాకీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి

క్రీడాకారులకు గొప్ప వరం



తైక్వాండో విభాగంలో భారత క్రీడాకారులు ఒలింపిక్స్ స్థాయికి వెళ్లారు. ఈసారి తప్పకుండా బంగారు పతకం సాధించి దేశ ప్రతిష్టను నిలబెడుతారు. ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత క్రీడాకారులకు ఇది గొప్ప వరం.

– చింత అనిల్‌కుమార్, తైక్వాండో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ, నల్లగొండ

గతం కంటే ఎక్కువ పతకాలు



ఈసారి ఒలింపిక్స్ క్రీడల్లో ఇండియాకు గతం కంటే ఎక్కువ పతకాలు వచ్చే అవకాశం ఉంది. బాడ్మింటన్‌లో పీవీ.సింధు, బాక్సింగ్‌లో నిఖత్ జరీనా ఆట తీరు పతకాలు సాధించేలా ఉన్నాయి. ఈసారి మన దేశానికి మరిన్ని పతకాలు రావాలని ఆశిస్తున్నా.

– వి.ఐశ్వర్య, వాలీబాల్ క్రీడాకారిణి

అంతర్జాతీయంగా మెరుగైన ప్రదర్శన



భారత ఆటగాళ్లు అంతర్జాతీయంగా మెరుగైన ప్రదర్శనతో సత్తా చాటుతున్నారు. ఈసారి ఒలింపిక్స్‌లో భారత్‌కు చాలా పతకాలు రావడం ఖాయమనిపిస్తోంది. తెలుగు క్రీడాకారులు జ్యోతి యర్రాజీ, నిఖత్ జరీనా, సాత్విక్, పీవీ సింధు, ఇషా సింగ్ ఫామ్‌లో ఉండడంతో పతకాలు వస్తాయనే నమ్మకం ఉంది.

– ఎస్‌కే.యూసఫ్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు

ఇండియాకు పతకాలు ఖాయం



ప్యారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో ఇండియాకు ఎక్కువ పతకాలు ఖాయమనిపిస్తోంది. పతకాల సాధనలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారత్ అదరగొడుతుందని అభిమానులు ఆశాభావంతో ఉన్నారు. గత ఒలింపిక్స్‌లో భారత్ ఏడు పతకాలు నెగ్గగా ఈసారి అంతకు రెండింతలు సాధిస్తుంది.

– ఎం.డీ.సిద్దీఖ్, బాక్సింగ్ క్రీడాకారుడు.

పతకాల సంఖ్య పెరుగుతుంది



ఈ సారి ప్యారిస్ ఒలింపిక్స్‌లో ఇండియాకు పతకాల సంఖ్య పెగుతుందని భారతీయులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అలాగే గత ఒలింపిక్స్ కంటే ఈ సారి భారత బృందం చాలా పటిష్టంగా ఉంది. భారత క్రీడాకారులకు విజయం చేకూరాలని ఆకాంక్షిస్తున్నా.

– ఎం.డీ.అక్బర్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, జిల్లా కార్యదర్శి

స్టార్ అథ్లెట్స్‌పైనే ఆశలు..



ఈసారి ఒలింపిక్స్‌లో ఇండియన్ స్టార్ అథ్లెట్స్‌పైనే భారత క్రీడాభిమానుల ఆశలు పెట్టుకున్నారు. భారత దేశపు అత్యంత ప్రసిద్ధ ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ నీరజ్ చోప్రా గతంలోలాగా మళ్లీ స్వర్ణం సాధిస్తాడని ఆశిస్తున్నా.

– శింబు, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి



నేడు జాబ్ మేళా

నల్లగొండ: నల్లగొండలోని ఉపాధి కల్పన కార్యాలయం క్యాంపస్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మాధవరెడ్డి గురువారం తెలిపారు. ఎస్ఎస్‌సీ నుంచి పీజీ చదివి 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. నల్లగొండ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందని, వివరాలకు 81858 74530ను సంప్రదించాలని కోరారు.

సెంట్రల్ యూనియన్ ఈసీ మెంబర్‌గా విజయకృష్ణ

నల్లగొండ టౌన్: టీఎస్‌జీఓ సెంట్రల్ యూనియన్ ఈసీ మెంబర్‌గా జిల్లా సహకార శాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వంగూరు విజయకృష్ణ నియామకమయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనియన్ కార్యాలయంలో టీఎన్‌జీఓ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కార్యదర్శి ముజీబ్‌లు విజయకృష్ణకు నియామకపత్రం అందజేశారు.

క్లుప్తంగా

అమెరికా క్రికెట్ బోర్డు చైర్మన్‌కు సన్మానం



వేణుకుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ పాపిరెడ్డి, వెంకట్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): అమెరికా క్రికెట్ బోర్డు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న తిరుమలగిరి మండలం అల్వాల గ్రామానికి చెందిన పిసికె వేణుకుమార్‌రెడ్డికి స్వగ్రామంలో గురువారం ఘన స్వాగతం లభించింది. ఇటీవల జరిగిన టీ20 వరల్డ్‌కప్‌కు అమెరికా ఆతిథ్యం ఇవ్వగా.. మ్యాచ్‌లు మొత్తం వేణుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. వరల్డ్‌కప్‌ను దిగ్విజయంగా నిర్వహించిన తర్వాత మొదటిసారి ఆయన అల్వాలకు రావడంతో మాజీ సర్పంచ్ పెంకీసు పాపిరెడ్డి, వెన్న వెంకట్‌రెడ్డి తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. మారుమూల ప్రాంతానికి చెందిన వేణుకుమార్‌రెడ్డి అమెరికా క్రికెట్ బోర్డుకు చైర్మన్‌గా ఎదగడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పామాయిల్ కోసం ఎగబడిన జనం

మిర్యాలగూడ టౌన్: పామాయిల్ ట్యాంకర్ నుంచి లీకవుతున్న పామాయిల్‌ను పట్టుకునేందుకు ప్రజలు ఎగబడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు వెళ్తున్న పామాయిల్ ట్యాంకర్ మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ సమీపంలోకి రాగానే అందులోని పామాయిల్ లీకయ్యింది. ఇది గమనించిన వెంకటాద్రిపాలెం గ్రామ చుట్టుపక్కల దుకాణాదారులు పామాయిల్ పట్టుకునేందుకు బకెట్లతో ఎగబడ్డారు. దీంతో డ్రైవర్ మిర్యాలగూడ రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకోగానే పామాయిల్ కోసం వచ్చిన వారు ఒక్కొక్కరుగా వెళ్లిపోయారు.

సరస్వతీ పుత్రుడిని ఆదుకుంటాం

- ఎక్స్(ట్విటర్) వేదికగా మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటన

సాక్షి ఎఫెక్ట్..

మిర్యాలగూడ: 'సరస్వతీ పుత్రుడికి సాయం చేయరూ..' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ఈ నెల 2వ తేదీన ప్రచురితమైన కథనానికి మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్(ట్విటర్) వేదికగా స్పందించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 211వ ర్యాంకు సాధించి ఐఐటీ బాంబేలో సీటు సాధించిన మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన అనాథ యువకుడు కుంచం శివకు సహాయం అందిస్తామని మాజీ మంత్రి ప్రకటించారు. సాక్షి కథనాన్ని కేటీఆర్‌కు ఎక్స్‌లో ట్యాగ్ చేస్తూ ఓ నెటిజన్ శివకు సహాయం చేయాల్సిందిగా కోరాడు. దీనికి కేటీఆర్ స్పందిస్తూ.. శివకు సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. దీంతో కుంచం శివతో పాటు యాద్గార్‌పల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


KTR
@KTRBRS
Will take care of this bright kid
@KTRoffice please coordinate
Mahiiii @MaheshJanm... · 1d
This is My Student.. Kuncham Shiva..
All India Open Category 211 Rank..
Got Seat in Computer Science in Prestigious IIT Mumbai..
He is an Orphan..
We could support him for his first Semester..
Don't know how he will get on his 4 years B Tech..
Plz Support Ramanna..
Think this Show more

ఎక్స్‌లో ట్వీట్ చేసిన మాజీ మంత్రి కేటీఆర్



కార్గిల్ విజయానికి పాతికేళ్లు

- నాటి 'ఆపరేషన్ కార్గిల్'లో ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు సైనికుల వీరమరణం
- తుపాకీ గుళ్లకు ఎదురొడ్డిన గోపయ్యచారి, మిట్ట శ్రీనివాస్‌రెడ్డి, షేక్ ఇమామ్
- వారి ప్రాణత్యాగాన్ని గుర్తు చేసుకుంటున్న జిల్లా ప్రజలు




కార్గిల్ సమీపంలోని టైగర్ హిల్స్ ప్రాంతంలో భారత సైనికుల విజయోత్సాహం (ఫైల్)

విజయోత్సవంలో పాల్గొన్న సైనికుల్లో వెంకటేశం


శత్రుదేశ సైన్యాల తుపాకీ గుళ్లు, ఫిరంగుల కాల్పులకు ఎదురొడ్డి నిలిచిన ధైర్యం.. మంచుకొండల్లో మడమతిప్పని పోరాటం.. భారత సైనికుల శౌర్యానికి సజీవ సాక్ష్యం.. కార్గిల్ యుద్ధం. 1999 మే 3న పాకిస్తాన్‌తో మొదలైన కార్గిల్ యుద్ధం జూలై 26న ముగిసింది. ఈ యుద్ధంలో ఎంతోమంది సైనికులు ప్రాణాలకు తెగించి శత్రు దేశ సైన్యాన్ని ఓడించి దేశ సరిహద్దులో త్రివర్ణ పతాకాన్ని విజయగర్వంతో ఎగురవేసి జయహో భారత్ జవాన్ అని కీర్తించబడ్డారు. అలాంటి కార్గిల్ యుద్ధంలో పోరాడి అమరులైన భారత వీరజవాన్లను స్మరించుకుంటూ.. నేడు కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ప్రత్యేక కథనం.

ధైర్యసాహసాలకు మారుపేరు గోపయ్యచారి



గోపయ్యచారి (ఫైల్)

సూర్యాపేట : భారత భూభాగాన్ని రక్షించేందుకు 1999లో పాకిస్తాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధంలో లాన్స్‌నాయక్ పోలోజు గోపయ్యచారి వీరోచితంగా పోరాడి వీరమరణం పొందారు. ఆ పోరాటంలో ఆయన చనిపోయి నేటికి 25 ఏళ్లు అవుతున్నా దేశం ఆయనను మరువలేకపోతోంది. పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన పోలోజు చంద్రమ్మ, కోటిలింగచారి దంపతులకు రెండోసంతానం గోపయ్యచారి. ఈయన 1985లో భారత సైన్యంలో లాన్స్‌నాయక్‌గా చేరారు. 1999 మార్చి 2న తన సోదరుడి వివాహానికి హాజరై తన కుటుంబంతో గడిపిన క్షణాలే చివరి రోజులు. మూడు నెలలకు జూలైలో పాకిస్తాన్.. కార్గిల్ ప్రాంతంలో చేసిన దురాక్రమణను అడ్డుకునేందుకు 5 ఫీడ్ రెజిమెంట్ దళం అక్కడికి చేరుకుంది. ఈ రెజిమెంట్‌లో సభ్యుడైన లాన్స్‌నాయక్ గోపయ్యచారి.. పాకిస్తాన్ సైనికులతో వీరోచితంగా పోరాడారు. ధైర్యానికి మారుపేరైన గోపయ్యచారి చివరికి శత్రుదేశ సైన్యం జరిపిన కాల్పుల్లో అమరుడయ్యారు. ఈ యుద్ధంలో భారత సైన్యం విజయం సాధించి కార్గిల్ ప్రాంతాన్ని చేజిక్కించుకుంది. దీంతో అమరుల త్యాగం ఫలించినట్లయింది.



కార్గిల్ యుద్ధ సమయంలో విధులు నిర్వహిస్తున్న, గోపయ్యచారి (ఫైల్)

వీరజవాన్ల త్యాగం వృథాకాదు

దేశ రక్షణ కోసం పోరాడి అమరులైన సైనికుల త్యాగం వృథాకాదు. ప్రాణాలు త్యాగం చేసే వీరులున్నంత కాలం పాకిస్తాన్, చైనా వంటి దేశాలు మనల్ని ఏమీ చేయలేవు. 25 ఏళ్ల క్రితం జరిగిన కార్గిల్ యుద్ధంలో నా భర్త వీరమరణం పొందడం ఎంతో గర్వంగా ఉంది. నా కుటుంబానికి ఆయన లేనిలోటు తీరనిది.

– పోలోజు శారద, గోపయ్యచారి సతీమణి

కార్గిల్ యుద్ధవీరుడు మిట్ట శ్రీనివాస్‌రెడ్డి



కార్గిల్ యుద్ధవీరుడు లాన్స్ నాయక్ మిట్ట శ్రీనివాస్‌రెడ్డి

త్రిపురారం : దేశం రక్షణ కోసం శత్రువులతో పోరాడి వీరమరణం పొందిన ఓ యుద్ధవీరుడి తల్లిదండ్రులు ఇప్పటికీ ఆయన జ్ఞాపకాలతోనే జీవిస్తున్నారు. 25 ఏళ్ల క్రితం జమ్మూకశ్మీర్ సరిహద్దుల్లో మిరాత్(కార్గిల్)లో జరిగిన యుద్ధంలో త్రిపురారం మండలం కొణతాలపల్లి గ్రామానికి చెందిన మిట్ట సత్తిరెడ్డి, మణెమ్మ దంపతుల కుమారుడు లాన్స్‌నాయక్ మిట్టా శ్రీనివాస్‌రెడ్డి వీరమరణం పొందాడు. ఈయన జమ్మూకశ్మీర్‌లో వీరజవాన్‌గా 1995లో ఉద్యోగంలో చేరాడు. దేశం కోసం ఏదైనా చేయాలనే తపనతో కష్టపడి జవాన్ స్థాయి నుంచి లాన్స్‌నాయక్‌గా ఎదిగాడు. 1999 జూలై 17న జరిగిన యుద్ధంలో శత్రువులతో పోరాడుతూ మృతి చెందాడు. మిట్టా శ్రీనివాస్‌రెడ్డి మృతి చెంది నేటికి 25 ఏళ్లు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి తల్లిదండ్రులు తమ స్వగ్రామమైన కొణతాలపల్లిలో కుమారుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి స్మరించుకుంటున్నారు. మా కుమారుడు దేశం కోసం వీరమరణం పొందడం గర్వంగా ఉందని ఆ తల్లిదండ్రులు పేర్కొన్నారు.

నేడు కార్గిల్ సిల్వర్‌జూబ్లీ విజయ్ దివస్

కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి 25ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం నల్లగొండలోని మాజీ సైనిక సంక్షేమ కార్యాలయంలో వేడుకలకు మాజీ సైనికులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తూటాలకు ఎదురొడ్డి ఆయుధాలు అందించా..

- మాజీ సైనికుడు వెంకటేశం



మాజీ సైనికుడు మునుకుంట్ల వెంకటేశం

నల్లగొండ డెస్క్ : కార్గిల్ పోరులో తోటి సైనికుల ప్రాణాలు పోతున్నా లెక్కచేయలేదు. ఆ సమయంలో దేశరక్షణే తన ధ్యేయమనుకున్నాడు. తన ప్రాణం పోయినా పర్వాలేదు.. సైనికులకు ఆయుధాలు చేరవేడమే లక్ష్యంగా కథన రంగంలో నిలిచాడు యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఏదుళ్లగూడేనికి చెందిన మునుకుంట్ల వెంకటేశం. కార్గిల్ విజయ దివస్ సందర్భంగా 'సాక్షి'తో తన అనుభవాలను పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే.. 1999 జూన్ 29న యుద్ధం జరిగే రోజు రాజస్తాన్‌లోని భరత్‌పూర్ నుంచి వాహనంలో ఆయుధాల లోడ్‌తో వెళ్తున్న నన్ను కార్గిల్ సమీపంలో టైగర్ హిల్స్ విలేజ్ దగ్గర ముందుకు వెళ్లనివ్వలేదు. పాకిస్తాన్ వైపు నుంచి కాల్పులు జరుగుతుండడంతో పోలీసులు అక్కడే ఆపేశారు. అయినప్పటికీ నేను ప్రాణాలకు తెగించి ఆయుధాలను తీసుకెళ్లి అన్‌లోడ్ చేశా. అప్పుడు మన ఆర్మీ సిబ్బంది ఆ ఆయుధాలతో పాకిస్తాన్ సైన్యంపై దాడి చేసి వారి ప్రాణాలు కాపాడుకున్నారు. నేను వెళ్లకుంటే అక్కడ ఉన్న మన ఆర్మీ బెటాలియన్ మొత్తం ప్రాణాలు కోల్పోయేది.

పాకిస్తాన్.. సిమ్లా ఒప్పందాన్ని ఉల్లంఘించింది

సిమ్లా ఒప్పందం ప్రకారం కార్గిల్ సమీపంలోకి ఇండియా, పాకిస్తాన్ ఆర్మీ రావొద్దని ఆదేశాలు ఉన్నాయి. కానీ అక్టోబర్‌లో మన ఆర్మీ సభ్యులు మారుతున్న సమయంలో పాకిస్తాన్ ఆర్మీ.. ఆ ఆదేశాలను ఉల్లంఘించి బంకర్లలోకి చొరబడి కాల్పులకు తెగబడింది. పాకిస్తాన్ సైన్యం కార్గిల్‌లోకి చొరబడినట్లు కార్గిల్ సర్పంచ్‌కు తెలిసినా మాకు చెప్పలేదు. అక్కడే ఉన్న ఒక గొర్రెల కాపరి గుర్తించి మన సైన్యానికి సమాచారం ఇవ్వడంతో అలర్ట్ అయ్యారు. చివరకు వాయుసేవ రంగ ప్రవేశం చేసి ఎయిర్ అటాక్ చేయడంతో పాకిస్తాన్ సైన్యం తలొగ్గింది. కార్గిల్ యుద్ధం సమయంలో నేను నా కుటుంబంతో కలిసి అక్కడే ఉన్నాను. నా భార్య, ఇద్దరు కుమారులను ఇంట్లో దాచి లైట్స్ ఆఫ్ చేసి వారికి చెప్పకుండా యుద్ధానికి వెళ్లాను. యుద్ధం తర్వాత పలు ప్రాంతాల్లో పని చేశాను. అనంతరం వలంటరీ రిటైర్మెంట్ తీసుకుని బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాను.

తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని..

తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని ఓ ముస్లిం యువకుడు సైన్యంలో చేరాడు. దేశ రక్షణ కోసం మిలిటరీలో చేరిన మూడేళ్లకే కార్గిల్ యుద్ధంలో శత్రుమూకలతో పోరాడి వీరమరణం పొందాడు నల్లగొండ పట్టణంలోని రహమాన్‌బాగ్‌కు చెందిన షేక్ ఇమామ్. ఇతని తండ్రి షేక్ అహ్మద్ మరాఠా రెజిమెంట్‌లో చేరి సైనికుడిగా పనిచేశారు. ఆరున్నరేళ్లకు పైగా పనిచేసి ఉద్యోగం వదిలి సొంతూరుకు తిరిగివచ్చారు. ఆ తర్వాత బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసి రిటైర్ అయ్యారు. ఇమామ్ పుట్టినప్పుడే తల్లి మరణించింది. చిన్నప్పటి నుంచే తండ్రి బాటలోనే నడవాలనుకునేవాడు. ఒక భారతీయుడిగా దేశానికి సేవ చేయాలని ఎంతో తపన పడేవాడు. అందులో భాగంగానే మిలిటరీలో చేరుతానన్నాడు. తనకొడుకు దేశ రక్షణలో పాలుపంచుకుంటున్నందుకు అతని తండ్రి ఎంతో మురిసిపోయాడు. ఉన్నత స్థాయికి చేరి ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు భారత భూభాగాన్ని రక్షించేక్రమంలో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో ఎదురొడ్డినిలిచాడు. శత్రుమూకల తుపాకి గుళ్లకు అమరుడయ్యాడు. 24 సంవత్సరాలు దాటినా తన కొడుకు జ్ఞాపకాలు మరువలేకపోతున్నారని తండ్రి కంటతడిపెట్టారు.

చేనేత కళను పరిరక్షించుకోవాలి

- పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్
- ప్రింటెడ్ చీరలను అరికట్టాలని భూదాన్‌పోచంపల్లిలో మహా ర్యాలీ



పోచంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు, నాయకులు తదితరులు

భూదాన్‌పోచంపల్లి: చేనేత కళను పరిరక్షించుకోవాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్ అన్నారు. గురువారం పోచంపల్లి పట్టణ కేంద్రంలో చేనేత పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ప్రింటెడ్ చీరలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మహార్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ.. తాను గతంలో కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖలో సలహాదారునిగా పనిచేశానని, అప్పట్లో గుజరాత్ కేంద్రంగా మిల్లుల్లో తయారు చేస్తున్న ప్రింటెడ్ చీరలను అరికట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని అన్నారు. నకిలీ చీరలను అరికట్టలేనప్పుడు పోచంపల్లి ఇక్కత్ డిజైన్‌కు భౌగోళిక గుర్తింపు, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఎందుకని ప్రశ్నించారు. చేనేత కళాకారులు ఎంతో నైపుణ్యంతో డిజైన్లు రూపొందిస్తే వాటిని వాట్సాప్‌లలో తెప్పించుకొని బడా వ్యాపారులు వెంటనే మిల్లుల్లో ప్రింట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం అంజయ్య మాట్లాడుతూ.. చేనత కార్మికుల హక్కుల కోసం సమష్టిగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం మాట్లాడుతూ.. రాజ్‌కోట్ చీరలు రావడం వల్ల గత ఎనమిదేళ్లుగా చేనేత కార్మికులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. దీంతో కార్పొ సంస్థలు చేనేత పరిశ్రమలోకి చొరబడి ప్రింటెడ్ చీరలను తయారుచేసి చౌకగా విక్రయించడం మొదలుపెట్టారని పేర్కొన్నారు. దీంతో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. జాతీయ చేనేత దినోత్సవ రూపకర్త ఎర్రమాద వెంకన్న మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లోనూ ప్రింటింగ్ చీరలు తయారవుతున్న నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఉద్యమించి ప్రధానితో పాటు కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని అన్నారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరపాటి రమేశ్ మాట్లాడుతూ.. చేనేత రంగాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. హ్యాండ్లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ తడక యాదగిరి మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా నకిలీ ఇక్కత్ చీరలను అరికట్టాలని ఉద్యమిస్తూనే ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.100కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటుచేసి ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖను బలోపేతం చేసినప్పుడే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అంతకు ముందు నేతన్న విగ్రహం, ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాలకు నివాళులర్పించారు. టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో దక్షిణ భారత రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మనోహరన్, రాష్ట్ర చేనేత, జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం, జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, వీవర్ సర్వీస్‌సెంటర్ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, జాతీయ అవార్డు గ్రహీతలు జెల్ల వెంకటేశం, తడక రమేశ్, దుద్యాల శంకర్, గంజి యాదగిరి, చేనేత నాయకులు తడక వెంకటేశం, తడక రమేశ్, ఎన్నం శివకుమార్, సూరెపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కత్ డూప్లికేట్ చీరలు విక్రయిస్తే కఠిన చర్యలు

పోచంపల్లి ఇక్కత్ డిజైన్ చీరలను డూప్లికేట్ చేసి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని దక్షిణ భారత రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మనోహరన్ అన్నారు. చేనేత పరిరక్షణ మహార్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోచంపల్లి ఇక్కత్‌కు 2004లో భౌగోళిక గుర్తింపు వచ్చిందని అన్నారు. పోచంపల్లి ఇక్కత్ డూప్లికేట్ చీరలు తయారుచేస్తున్న వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు రూ.50వేల జరిమానా లేదా 6 నెలల జైలుశిక్ష విధించే అవకాశం ఉందన్నారు. వినియోగదారులు కూడా సిల్క్‌మార్క్, హ్యాండ్లూమ్ మార్క్ కలిగిన చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్లు కూడా తీసుకోవాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం. వెంకటేశం మాట్లాడుతూ.. పోచంపల్లి ఇక్కత్ కళను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వీరి వెంట జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, హైదరాబాద్ వీవర్ సర్వీస్ సెంటర్ అధికారి శ్రీనివాస్, డీఓ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న దక్షిణ భారత రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మనోహరన్

సమాజ చైతన్యంలో కళాకారులు కీలకం

- తుంగతుర్తి, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి
- సాంస్కృతిక సారథి కళాకారుడు వేముల నరేశ్ సంతాప సభలో పాల్గొన్న నాయకులు



వేముల నరేశ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు సామేల్, వీరేశం, బీఎల్ఆర్

శాలిగౌరారం: సమాజాన్ని చైతన్యపర్చడంలో కళాకారుల పాత్ర కీలకమని తుంగతుర్తి, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామంలో గురువారం నిర్వహించిన సాంస్కృతిక సారథి కళాకారుడు వేముల నరేశ్ సంతాప సభకు వారు హాజరై నరేశ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడంలో కళాకారులు ముందుంటారన్నారు. నరేశ్ తన గళంతో ఎంతో ఆకట్టుకున్నాడని, అనారోగ్య సమస్యలతో అతడు అకాల మరణం చెందడం అతడి కుటుంబానికి, కళారంగానికి తీరని లోటన్నారు. నరేశ్ కుటుంబానికి తామంతా అండగా ఉంటామన్నారు. నరేశ్ కుటుంబానికి ప్రముఖ గేయ కళాకారుడు ఏపూరి సోమన్న రూ.50వేల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజిని, ఏపూరి సోమన్న, వేముల పుష్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, డీసీసీ నాయకులు అన్నెబోయిన సుధాకర్, పలువురు కళాకారులు, నాయకులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తి దుర్మరణం



రాంబాబు (ఫైల్)

మునగాల(కోదాడ): బైక్‌పై వెళ్తున్న వ్యక్తి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి క్రాస్ చేస్తుండగా.. కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన మునగాల మండలం తాడువాయి గ్రామ శివారులో కలకోవ స్టేజీ వద్ద గురువారం జరిగింది. మునగాల ఏఎస్ఐ కల్లు శ్రీనివాసరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడువాయి గ్రామానికి చెందిన శ్రీపెంరబుదూరి రాంబాబు(58) గత కొన్నేళ్లుగా మునగాల మండల కేంద్రంలో మెడికల్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తాడువాయిలో తన తోట వద్దకు బైక్‌పై వెళ్లి తిరిగి మునగాలకు వస్తూ కలకోవ స్టేజీ వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి క్రాస్ చేస్తుండగా.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాంబాబును సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలానికి మునగాల సీఐ బి. రామకృష్ణారెడ్డి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతుడి భార్య లక్ష్మీశైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు విదేశాల్లో ఉండడంతో అతడు ఇండియాకు వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమాచారం.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

- భర్త, అత్తమామలకు జైలు శిక్ష

హుజూర్‌నగర్: అదనపు కట్నం కోసం వేధించి వివాహిత ఆత్మహత్యకు కారకులైన ఆమె భర్త, అత్తమామలకు జైలు శిక్ష విధిస్తూ హుజూర్‌నగర్ రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్యాంశ్రీ గురువారం తీర్పు వెలువరించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన బంధం లక్ష్మాద్రి రెండో కూమార్తె శ్రావణిని మేళ్లచెరువు మండలం కందిబండ గ్రామానికి చెందిన కానుగు రవికుమార్‌కు ఇచ్చి 2014లో వివాహం జరిపించారు. వివాహ సమయంలో ఒక ఎకరం పొలం, రూ.10లక్షల నగదు కట్నంగా ఇచ్చారు. అయితే శ్రావణి భర్త రవికుమార్, అత్తమామలు రాజ్యం, వెంకటేశ్వర్లు, ఆడపడుచు భాగ్యలక్ష్మి ఆ ఎకరం పొలం అమ్మి డబ్బులు తీసుకురావలని, అదనంగా మరొక రూ.4లక్షలు పుట్టింటి నుంచి తేవాలని శ్రావణిని వేధించడం ప్రారంభించారు. ఈ విషయాన్ని శ్రావణి తన తల్లిదండ్రులకు చెప్పగా.. వారు త్వరలోనే పొలం అమ్మి ఆ డబ్బులను, మరో రూ.4 లక్షలను ఇస్తామని అల్లుడికి, అతడి తల్లిదండ్రులకు నచ్చజెప్పారు. అయినా వారు సంతృప్తి చెందకుండా శ్రావణిని వేధింపులకు గురిచేయడంతో ఆ వేధింపులు భరించలేక శ్రావణి 2017 ఫిబ్రవరి 18న తన అత్తగారింట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న శ్రావణి తండ్రి లక్ష్మాద్రి అదే రోజు మేళ్లచెరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి కోదాడ డీఎస్పీ రమణారెడ్డి ఆదేశాల మేరకు అప్పటి ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అనంతరం దర్యాప్తును పూర్తిచేసి శ్రావణి భర్త రవికుమార్, అత్తమామలు రాజ్యం, వెంకటేశ్వర్లు, ఆడపడుచు భాగ్యలక్ష్మిపై చార్జిషీట్ దాఖలు చేశారు. పలువురు సాక్షులను విచారించిన హుజూర్‌నగర్ రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్యాంశ్రీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బొబ్బా కోటిరెడ్డి వాదనలతో ఏకీభవిస్తూ మృతురాలి భర్త రవికుమార్‌కు పదేళ్ల జైలు శిక్ష, అత్తమామలకు ఒక్కొక్కరికి ఏడేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ ఎ. వెంకన్న సహకరించారు.

వ్యక్తిని కొట్టి బైక్ చోరీ

గుర్రంపోడు: వ్యక్తిని కొట్టి ద్విచక్ర వాహనం చోరీ చేసిన ఘటన బుధవారం రాత్రి గుర్రంపోడు మండలం జూనూతుల గ్రామ స్టేజీ వద్ద జరిగింది. తేనపల్లి తండాకు చెందిన వడిత్య మంగ్లా గురువారం రాత్రి 8 గంటల సమయంలో కేశనేనిపల్లి తండా నుంచి తేనపల్లి తండాకు బైక్‌పై వెళ్తుండగా.. జూనూతుల గ్రామ స్టేజీ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మంగ్లాను అడ్డగించి కొట్టి బైక్ తీసుకుని పారిపోయారు. బాధితుడు గుర్రంపోడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

మిర్యాలగూడ: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన రాయికింది గోపాల్(54) తనకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయానికి పెట్టుబడితో పాటు ఇతర అవసరాల నిమిత్తం గోపాల్ తనకు తెలిసిన వారి వద్ద అప్పులు తీసుకున్నాడు. అప్పులు ఇచ్చిన వారు తమ డబ్బులు తిరిగి ఇవ్వమని నిత్యం గోపాల్‌ను ఒత్తిడి చేస్తుండడంతో.. గురువారం తెల్లవారుజామున ఇంట్లో పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. తనను డబ్బులు తిరిగి ఇవ్వమని వేధిస్తున్న వారి పేర్లను గోపాల్ సూసైడ్ నోట్‌లో రాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి బంధువులు తెలిపారు. గోపాల్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం కాగా చిన్న కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వలస కార్మికుడు దుర్మరణం

చౌటుప్పల్: మండలంలోని కొయ్యలగూడెం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వలస కార్మికుడు మృతిచెందాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం గుమ్లా జిల్లా బసుర మండలం సాంజ్వారియా గ్రామానికి చెందిన శంకర్ ఓరాన్(35) భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలోని హెజిలో పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సాంజ్వారియా గ్రామానికి చెందిన మరో వ్యక్తి హెజిలో పరిశ్రమలో పనిచేస్తుండడంతో ఇటీవల శంకర్ ఓరాన్ ఇక్కడికి వచ్చాడు. ఇద్దరూ కలిసి కంపెనీలో పనిచేసుకుంటూ దోతిగూడెం గ్రామంలో ఉంటున్నారు. బుధవారం రాత్రి డ్యూటీకి వెళ్లిన శంకర్ ఓరాన్ గురువారం ఉదయం ఆరు గంటలకు డ్యూటీ ముగిశాక తన గదికి వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత అతనికి ఫోన్ రావడంతో రూం నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామం వద్ద శంకర్ ఓరాన్ విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న డీసీఎం అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శంకర్ ఓరాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోలీసులు చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి స్వగ్రామానికి చెందిన అర్జున్ టొప్పో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: బైక్‌పై వెళ్తున్న యువకులను కారు ఢీకొట్టడంతో గాయపడ్డారు. ఈ ఘటన యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో గురువారం జరిగింది. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన కాశీరాం, బకిల్ బైక్‌పై వెళ్తూ యదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని సన్నిధి హోటల్ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా.. కారు వారిని ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. యువకులిద్దరూ వడాయిగూడెం గ్రామంలో టైల్స్ వర్క్స్ చేస్తున్నారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.